క్లుప్తంగా

నేడు భీమడోలులో మా నమ్మకం నువ్వే జగన్

భీమడోలు: భీమడోలులో ఈనెల 19న బుధవారం సాయంత్రం 5 గంటలకు జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వెసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అన్న ప్రసాద వితరణ ప్రారంభం

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మవారి ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఆలయంలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. తొలి మంగళవారం అన్నప్రసాద వితరణకు దాత కొండ్రెడ్డి సుబ్బారావు, భాగ్యవతి దంపతులు ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు గోనె సంచులు సరఫరా చేయాలి

భీమడోలు: రైతులు పండించిన ప్రతి గింజకొనే విధంగా ప్రభుత్వం గోనె సంచులు అందివ్వాలని సీపీఎం, సీపీఐ ప్రచార భేరి యాత్ర బృందం కోరింది. భీమడోలు ఉన్నత పాఠశాల రోడ్డులో రైతులు ఆరబోసుకున్న దాళ్వా ధాన్యాన్ని మంగళవారం ఆ బృందం పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద గల ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైస్‌మిల్లర్లు, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, నారవల్లి రమణారావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు: స్థానిక బళ్లరేవు తూము సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి ఏలూరు వాస్తవ్యులు కొల్లిపర శ్రీనివాస భగవాన్, పద్మలత దంపతులు కాశీ యాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రేములగడ్డ రాము పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెదవేగి : కరోనా వైరస్ రోజురోజుకూ వ్యాప్తి చెందుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదవేగి వైద్యాధికారి పి పూర్ణిమ చెప్పారు. గడచిన 24 గంటల్లోల పెదవేగి మండలం రామశింగవరంలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైందని పూర్ణిమ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 21 కేసులు నమోదయ్యాయని వైద్యులు వివరించారు.

భవిత కేంద్రానికి వితరణ

ఉంగుటూరు: భవిత కేంద్రానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వితరణ అందింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతల సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులు వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులు, స్నాక్స్ అందించారు. క్లబ్ సెక్రటరీ అడపా శోభారాణి, భవిత కేంద్రం నిర్వాహకులు రాజు, విమల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చికి ఆర్థిక సాయం

దెందులూరు: పోతునూరులోని నిత్యసహాయ మాత ఆర్‌సీఎం చర్చికి మంగళవారం దాత యండగండి రాజు రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని చర్చి ఫాదర్ పీ.డేవిడ్‌కు మంగళవారం అందజేశారు. భక్తుల సౌకర్యార్థం కూలర్‌ను కొనుగోలుకు వీటిని వినియోగిస్తామని ఫాదర్, సంఘ స్తులు దాతకు తెలిపారు. దాతను ఫాదర్, గ్రామస్తులు, యువత అభినందించారు.

రైతులతో గ్రామసభ

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా భూమి కోల్పోయిన రైతులతో మంగళవారం వీఆర్‌వోలు గ్రామ సభలు నిర్వహించారు. పోలవరం మండలంలోని ప్రాజెక్టు ముంపు గ్రామాలైన రామయ్యపేట, పైడిపాక, ప్రగడపల్లి పంచాయతీల పరిధిలో గిరిజనేతర రైతులతో వీఆర్‌వోలు సమావేశం నిర్వహించి, భూములు కోల్పోయిన రైతుల వివరాలను తెలియజేశారు. అలాగే సదరు రైతులకు సంబంధించిన ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను సమర్పించాలన్నారు. అప్పట్లో భూములు సేకరించిన సమయంలో తక్కువ నష్టపరిహారం ఇచ్చారని, రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయగా, ఎకరానికి రూ.5లక్షల వరకు నష్టపరిహారం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ గ్రామసభలు నిర్వహించి, రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు వీఆర్‌వోలు పేర్కొన్నారు.

సంక్షేమం గడపగడపకూ చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- లబ్ధిదారుల చిరునవ్వులు చిందించడంతో సంతృప్తి
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- భీమడోలులోని జగనన్న కాలనీలో ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి పర్యటన


భీమడోలు జగనన్న కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సంక్షేమం గడపగడపకూ చేరాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. భీమడోలులోని జగనన్న హౌసింగ్ కాలనీలో మంగళవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి ఆయన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల జగనన్న కాలనీలో స్థలం పొంది ఇల్లు నిర్మించుకున్న మహిళ అన్నపూర్ణ ఇంటికి వారు వెళ్లారు. ప్రభుత్వ పాలనపై ఆమె అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వారిని అన్నపూర్ణ సాదరంగా ఆహ్వానించి వారికి తేనీటి విందు అందించింది. జగన్ బాబు నాకు స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించి ఇచ్చారని, ప్రతి రోజు ఇక్కడ కాలనీ వాసులకు ఇడ్లీలు, టీలు అమ్ముకుంటూ రూ.500 సంపాదిస్తున్నానని, వాటిలో రూ.200 ఖర్చులు పోను మిగిలిన సొమ్ముతో కుటుంబ పోషణ చేసుకుంటున్నట్టు అన్నపూర్ణ వారికి వివరిస్తూ సంతోషం వ్యక్తం చేసింది. ఆమె ఆమోదంతో తన ఇంటి వద్ద స్టిక్కర్‌ను అతికించారు. అక్కడ లబ్ధిదారులను కలిసి వారి అభిప్రాయాలు సేకరించారు. మా నమ్మకం జగన్నే అంటూ వారంతా ముక్తకంఠంతో బదులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్ని విధాలుగా కష్టించి పని చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు మాదిరిగా హామీలిచ్చి దగా చేసే వ్యక్తి కాదని రాష్ట్రంలోని ప్రజలంతా నమ్మారని, మాటిస్తే మడమ తిప్పని సీఎంగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మీ అందరి చల్లని దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెదవేగి : కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పెదవేగి మండలంలోని విజయరాయి, రాయన్నపాలెంలో సంఘ నాయకులు పర్యటించి ధర లేక గుట్టలుగా పోసిన కొబ్బరికాయలను పరిశీలించారు. కొబ్బరి కాయలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా కొబ్బరి తోటకు రూ.60వేలకు పైగా పెట్టుబడి అవుతోందన్నారు. చెట్టు నుంచి కొబ్బరికాయ కోసి గుట్టగా పోయడానికి కాయకు రూ.4 ఖర్చు అవుతోందని చెప్పారు. వ్యాపారులు ఎండు కొబ్బరి కాయకు రూ.5.50 మాత్రమే ధర ఇవ్వడం వల్ల కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నాఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎండు కొబ్బరి కాయకు రూ.12 కనీస ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతుల సమస్యలపై ఉద్యాన శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. కుప్పాల లక్ష్మయ్య,జి. గోతియ్య,కె.రాజు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్ జగన్


మొయ్యేరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు


అర్ధవరంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు

గణపవరం: నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పాలనతో, ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తోందని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోట్లమంది ప్రజల గుండె చప్పుడుగా మారారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, అన్నారు. మంగళవారం రాత్రి గణపవరం మండలం మొయ్యేరు గ్రామ సచివాలయం పరిధిలో నువ్వే మా నమ్మకం జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వాసుబాబు అన్నారు. ప్రజల అండ ఉన్నంతకాలం జగన్‌ను ప్రతి పక్షాలు, పచ్చమీడియా ఏమీ చేయలేవన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో తెలుసుకుని, లోపాలు సరిదిద్దడానికే గడపగడపకు వచ్చామన్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను యజమానుల అనుమతిమేరకు ఆయా గృహాలకు అతికించారు. గత ప్రభుత్వం అరకొరగా పథకాలను అమలుచేసి అర్హులకు అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ఎంతమంది ఉన్నా పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అవినీతి, లంచం, దళారులు, సిఫార్సులు అనేమాటలు వినిపించని పాలన రాష్ట్రంలో ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు, యువకులు, వృద్ధులతో వాసుబాబు ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుపై పలు ప్రశ్నలు వేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మిబాబులు, సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు ద్వారంపూడి విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఈదర అశోక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంటా పద్మాజీ, సచివాలయ కన్వీనర్లు పాలా చింతారావు, పొనాకనకదుర్గ, పొట్ల గమానియేలు, మండల పార్టీ కన్వీనర్ దండు రాము, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

గణపవరం మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని ముప్పర్తిపాడు, మొయ్యేరు, పిప్పర, గణపవరం, వరదరాజపురం, అర్ధవరం, జల్లికొమ్మర, వల్లూరు, సరిపల్లెలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హత ఉన్నా పథకం అందలేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలు జవాబులు రాసుకున్నారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. అర్ధవరం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుల పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు

దెందులూరు: ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ మాట తప్పకుండా అమలు చేసిన సీఎం జగన్‌ను ప్రజలు ఆరాధిస్తున్నారని కొత్తగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత కనకరాజు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పాలనలో గల వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించారని అన్నారు. సీఎం జగనన్న పాలనలో మేలు చేకూరిందని లబ్ధిదారులు ముక్తకంఠంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని వైసీపీ నాయకులు అన్నారు. యువత, మహిళలు, వృద్ధుల సంతోషం తమ సర్వేలో చెప్పిన సమాధానాల బట్టి అర్థమైందన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి, సంక్షేమం భద్రత కోసం మద్దతిస్తామని వారంతా అంటున్నారని నాయకులు అన్నారు. తొలుత కిట్లను పంపిణీ చేశారు. వారి వెంట నాయకులు ఉదయ్, రాజు, వార్డు మెంబర్లు, గృహసారథులు, వలంటీర్లు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాల అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని నిడమర్రు జెడ్పీటీసీ కోడే కాశి రైతులను కోరారు. మంగళవారం పెదనిండ్రకొలనులోని రైతు భరోసా కేంద్రంను జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఉంటుందన్నారు. మద్దతు ధరతోపాటు ఉచిత గోనె సంచులతోపాటు లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు సైతం ప్రభుత్వం భరిస్తుందన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాట్ల శివ వర్మ, డైరెక్టర్లు పి. కాశీ ప్రసాదు, బెవర రామకొండలు, ఆర్‌బీకే చైర్మన్ దాసరి సురేష్, ఇన్‌చార్జ్ బి. రవికుమార్, కార్యదర్శి కెవీవీ సత్యనారాయణ, సహాయక కార్యదర్శి ఏఎస్‌వీఎం భీమేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ కోడే ఆంజనేయులు, రైతులు చినిమిల్లి రామకృష్ణ, కడిమి రామకృష్ణ, కాశీ విశ్వనాధ వర్రి సుబ్బారావు తదితరులున్నారు.

ముమ్మరంగా వరి కోతలు



కొవ్వలి, దోసపాడు ప్రాంతాల్లో వరికోతలు

దెందులూరు: మండలంలోని కొవ్వలి, పోతునూరు, ఉండ్రాజవరం, దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లిలో ముమ్మరంగా వరి కోతలు చేపట్టారు. 1127 వరి విత్తనాన్ని అధికంగా గ్రామాల్లో రైతులు సాగు చేశారు. మంగళవారం దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ వరి పొలాలను పరిశీలించారు. ఈ ఏడాది సంతృప్తికరంగా పంటలు పండాయని రైతులు వ్యవసాయ శాఖాధికారికి వివరించారు. త్వరితగతిన పూర్తయ్యేందుకు వరి కోత మిషన్లతో రైతులు ముమ్మరంగా పనులు చేస్తున్నారు.

పేదల హక్కులను గౌరవించాలి

దెందులూరు: పేదల హక్కులను గౌరవించి, దళితులకు అందరూ బాసటగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బీ. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం దోసపాడులో నిర్వహించిన భూపోరాటంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోసపాడులో సుమారు 50 ఏళ్ల క్రితం పేదలకు బీ–ఫారం పట్టాలు పంపిణీ చేశారని, వాటిని పెత్తదారులు, భూస్వాములు అధికారుల సహకారంతో ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. ఈ భూములు మావేనని 2007వ సంవత్సరం నుంచి పేదలు పోరాటం చేస్తున్నా అధికార యంత్రాంగం భూస్వాములకు కొమ్ముకాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. 2015 లోకాయుక్త కోర్టులో రెండుసార్లు పేదలకు అనుకూలంగా తీర్పునిచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. లోకాయుక్త తీర్పు ప్రకారం వాటిని అసైన్డ్ భూములుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం దోసపాడు పేదలకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.మహంకాళిరావు, మహేష్, మాధవ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఏ.క్రాంతి, సీఐటీయూ నాయకులు జ్యోతి, దోసపాడు దళితులు పాల్గొన్నారు.

కోర్టు హాజరు పట్టీలో సంతకాలు పెట్టమన్నాం

బుట్టాయగూడెం : తాను భూ వివాదాలకు సంబంధించి కోర్టు నిర్వహించిన సమయంలో కోర్టుకు హాజరైన వారు హాజరుపట్టీలో సంతకాలు పెట్టడం తప్పనిసరి అని బుట్టాయగూడెం తహసీల్దార్ ఎస్.శారా శాంతి అన్నారు. తన విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు తాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై దువ్వెల సృజన అనే మహిళ తనపై ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ వివరణ ఇచ్చారు. బుట్టాయగూడెం మండలం రేగులకుంట గ్రామంలో బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1457లో ఒకే కుటుంబానికి చెందిన వారి మధ్య వివాదం ఏర్పడిందని అన్నారు. ఈ వివాదం జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓల దృష్టికి కూడా వెళ్లిందని అన్నారు. అయితే ఆర్‌డీఓ ఈ భూ వివాదంపై కోర్టు నిర్వహించాలని ఆదేశించడంతో ఇరు వర్గాలను పిలిపించి కోర్టు నిర్వహిస్తుండగా దువ్వెల సృజన అనే లోపలికి ప్రవేశించి పెద్దగా అరుస్తూ విధులకు ఆటంకం కలిగించిందని చెప్పారు. అంతేకాకుండా కోర్టుకు హాజరైన వారిని పుస్తకంలో సంతకాలు కూడా పెట్టనివ్వకుండా తీసుకువెళ్లిందని చెప్పారు. రెండు వర్గాల్లో మరొక వర్గానికి చెందినవారు హాజరుపట్టీలో సంతకం పెట్టారని అన్నారు. ఇదే విషయాన్ని తాను జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓల దృష్టికి తీసుకువెళ్లానని ఆమె చెప్పారు. కోర్టు జరుగుతున్న సమయంలో అనుమతి లేకుండా వచ్చి ఒక మెజిస్ట్రేట్‌పై కేకలు వేయడం, సమస్య పరిష్కారానికి వచ్చిన వారిని బయటకు తీసుకువెళ్లడం, విధులకు ఆటంకం కలిగించడం కాదా అని ఆమె అన్నారు. జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే కొఠారు సహకారంతో అభివృద్ధి పనులు


సానిగూడెం పెద్ద చెరువు వద్ద కల్వర్టు, రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కామిరెడ్డి నాని, సర్పంచులు విష్ణు, సుబ్బారావు

దెందులూరు: సానిగూడెం పెద్ద చెరువు పక్కన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మంజూరు చేసిన నిధులతో కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభయ్యాయని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం సానిగూడెం వచ్చి హడావిడి చేస్తూ పనులు తాను చేయిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడంపై నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ముస్లింల శ్మశాన స్థలం, కల్వర్టు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సానిగూడెం, గంగన్నగూడెం, గాలాయగూడెంలోని 40 కుటుంబాలకు చెందిన ముస్లింలు చింతమనేని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన ఇంటికి వెళ్లి కల్వర్టు నిర్మాణం, శ్మశానం రోడ్డు, శ్మశాన అభివృద్ధి చేయాలని అడగ్గా టీడీపీ నాయకులు లేకుండా ఎలా వచ్చారని అవమానించి పంపారని గుర్తు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సానిగూడెం, గంగన్నగూడెం వచ్చినప్పుడు స్థానిక ముస్లింలు కల్వర్టు, రోడ్డు, శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కొఠారు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సానిగూడెం సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) ఆధ్వర్యంలో ఈ నెల 5న జేసీబీతో చదును చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. కల్వర్టు నిర్మాణంతో పాటు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొఠారు నిధులు మంజూరు చేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చింతమనేనికి ముస్లింల ఓట్లు గుర్తుకు వచ్చాయా అని నాని ప్రశ్నించారు. ముస్లింల శ్మశాన స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. సర్వే ద్వారా మూడు గ్రామాల్లోని ముస్లిం శ్మశాన స్థలాన్ని కాపాడతామన్నారు. బుధవారం శ్మశాన స్థలానికి ఫెన్సింగ్ పనులు ప్రారంభిస్తామన్నారు. పనులు వేగవంతం జరిగేందుకు కామిరెడ్డి నాని రూ. 10 వేలను ముస్లిం సంఘ పెద్దలు ఇమామ్ షేక్ మస్తాన్, కార్యదర్శి షేక్ సుబానీ, ఉపాధ్యక్షులు షేక్ బాజీకి అందించారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, కొప్పులవారిగూడెం ఎంపీటీసీ యర్రా సలోమి వెంకటరత్నం, వార్డు మెంబర్లు శ్రీధర్, జీమ్‌సాలను, ముస్లిం పెద్దలు, సానిగూడెం, గంగన్నగూడెం, గాలాయగూడెం గ్రామస్తులు ఉన్నారు.

సర్వోదయ సమ్మేళనం.. నిత్య స్ఫూర్తిదాయకం


సర్వోదయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న గాంధేయ వాదులు

ఉంగుటూరు: సర్వోదయ సమ్మేళనాన్ని గుర్తుచేసుకుంటూ సర్వోదయ మండలి నాయకులు, గాంధేయ వాదులు మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. నాచుగుంట సర్వోదయ స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గాంధేయ వాది ఉంగుటూరుకు చెందిన కొండ్రెడ్డి సర్వేశ్వరరావు సర్వోదయ సేవ, నల్లజర్లకు చెందిన యర్రా రాధాకృష్ణకు గాంధీ ప్రచార పురస్కారాలు అందజేశారు. ఏలూరుకు చెందిన అడుసుమిల్లి నిర్మలకు స్త్రీ శక్తి పురస్కారం అందజేసి సత్కరించారు. గాంధేయ వాది వెంకట్రామయ్యను సత్కరించారు. అనంతరం సర్వోదయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. గాంధీజీ, భూదాన ఉద్యమ పితామహుడు వినోబాబావే, చింతలపాటి మూర్తిరాజు చిత్రపటాలకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వోదయ సమ్మేళనం నిత్యం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సంయుక్త కార్యదర్శి జానికి అధ్యక్షులు చర్ల మృదుల, కోశాధికారి ఆర్‌ఎస్‌వీ రాజు, మానవత ప్రతినిధులు సూర్యనారయణరాజు, సత్యనారాయణమూర్తి, సింధు, రిటైర్డు జడ్జి బొమ్మిడి అప్పారావు, కళాకారులు సంఘం జిల్లా కన్వీనర్ బొడ్డేపల్లి అప్పారావు, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత సురేష్, ఇమ్మణి గంగాధరరావు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి పూజలు

పెదపాడు: ఏపూరు గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి, అప్పగింత లు, తిరుమంజన సేవ చక్రస్నానం, తీర్థ గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణ మూకబలి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహించిన యాగా ల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

భీమడోలు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ పార్టీలు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి యాత్ర మంగళవారం భీమడోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలపై లక్షల కోట్ల భారం మోపుతోందన్నారు. అదానీ వంటి కార్పొరేట్ దొంగలకు రూ.లక్షల కోట్లు రాయితీలను బ్యాంకు రుణాలను అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని విస్మరించిదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, నారవల్లి రమణారావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలకు కారణమైన మరో వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం మండలంలోని జయపురానికి చెందిన ఘంటసాల ఎలీషా జయపురం నుంచి తన మోటారు సైకిల్‌పై ఏలూరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఎలిషాకు రక్తపు గాయాలు కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.